క్లుప్తంగా

పైనాపురంలో భూముల రీ సర్వే



ముత్తుకూరు: కూటమి ప్రభుత్వం మండలానికి ఒక రెవెన్యూ గ్రామంలో భూముల రీ సర్వే తలపెట్టింది. పైలట్ ప్రాజెక్ట్ కింద మండలంలోని పైనాపురం గ్రామంలో సోమవారం సర్వేను ప్రారంభించారు. రీ సర్వే డీటీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏ, ఇద్దరు విలేజ్ సర్వేయర్లు బృందంగా ఏర్పడ్డారు. ఇలాంటి ఐదు బృందాలు సర్వేలో పాల్గొంటున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మర్యాదపూర్వకంగా..



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర, రూరల్ మండలాలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులుగా ఎంపికైన టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డిలను పలువురు కౌన్సిలర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కలిసి ఈ మేరకు సత్కరించారు. కౌన్సిలర్లు షేక్.షాహుల్, వై.యానాదిరెడ్డి, బి.మల్లారెడ్డి, కె.అనంతమ్మ, బి.ప్రమీలమ్మ, ఎం.జయంతి, షేక్.షకీల, ఫయాజ్‌బాషాతో పాటు పార్టీ నేతలు రాయుడు, ప్రవళిక, హరిలు పాల్గొన్నారు.

సీపీఎం నేతల ప్రచారం



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి పట్టణంలో సీపీఎం నేతలు సోమవారం ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నేత ముత్యాల గురునాథం మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ నేతలు గండవరపు శేషయ్య, చల్లకొలుసు మల్లికార్జున, అంకయ్య, శ్రీనివాసులు, సురేష్, జానీబాషా, కన్నయ్య, రత్తయ్య, ఖాదర్‌బాషా, కోటయ్య పాల్గొన్నారు.

తాటిపర్తిలో సర్వే



పారిశుద్ధ్య పనుల పరిశీలన

పొదలకూరు: మండలంలోని తాటిపర్తిలో సోమవారం కుష్ఠు వ్యాధికి సంబంధించిన సర్వే జరిగింది. ఈ సందర్భంగా మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ కుష్ఠుకు సరైన చికిత్స అందిస్తే అంగవైకల్యాన్ని నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

➡ మహ్మదాపురం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను డాక్టర్ నరసింహారావు పరిశీలించారు. డాక్టర్ వెంట ఆరోగ్య పర్యవేక్షకుడు శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ మల్లికార్జున, సహాయకులు పెంచలమ్మ, సుశీల, కవిత, చంద్రమౌళి, ఆశావర్కర్లు ఉన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

కోవూరు: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై అవగాహన కలిగి ఉండాలని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వేగూరు గ్రామంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈఈ కె.రమేష్ చౌదరి, అసిస్టెంట్ ఇంజినీర్ కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో యువకుడి వంచన

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలో ఓ యువతిని ప్రేమపేరుతో వంచించిన యువకుడిని సోమవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం శాంతినగర్‌లో నివాసం ఉంటున్న ఓ యువతిని అదే ప్రాంతంలో గతంలో నివాసం ఉండి ప్రస్తుతం నెల్లూరులో ఉంటున్న దండు భానుప్రకాష్ అనే యువకుడు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి మోసం చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి భానుప్రకాష్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

వస్తున్నారు.. వెళ్తున్నారు!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించింది. నేడు కూటమి ప్రభుత్వంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మొక్కుబడిగా సాగుతోంది. ఎన్నిసార్లు అర్జీలిచ్చినా ఉపయోగం లేకుండా పోయిందని జనం జిల్లా కేంద్రం బాట పడుతున్నారు. దీంతో స్థానికంగా అధికారులు ఈ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహిస్తూ చేతులు దులుపుకొంటున్నారు.

- మండలాల్లో మొక్కుబడిగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- వివిధ శాఖల అధికారుల డుమ్మా
- సమస్యలు పరిష్కారం కావడం లేదని జనం ఆవేదన



తోటపల్లిగూడూరు: తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా కుర్చీలు

తిరుగుతున్నా..



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు నారాయణరెడ్డి. మండలంలోని ఆర్‌వై పాళెం గ్రామవాసి. ఈయన పట్టా పొలం వాగు పోరంబోకుగా ఉంది. దీంతో కొద్దిరోజుల క్రితం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అప్పటి నుంచి రెవెన్యూ కార్యాలయం నుంచి చుట్టూ తిరుగుతున్నారు. పలుమార్లు తాను అందజేసిన వినతిపత్రం గురించి గుర్తుచేసేందుకు కార్యాలయానికి వస్తున్నట్టు తెలిపారు.

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా మొక్కుబడిగా ఇద్దరు, ముగ్గురు మాత్రమే వస్తున్నారు. సోమవారం తహసీల్దార్ బి.శివకృష్ణ ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి వచ్చారు. ఉదయం 11 గంటలకు ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రియాజ్, వెలుగు ఏపీఎం చిన్నయ్య, ఆర్‌ఐ నారాయణలు మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్‌కు సూరాయపాళెం, పులికల్లు గ్రామాల నుంచి కేవలం రెండు వినతులు మాత్రమే అందాయి. ఆన్‌లైన్‌లో మరో మూడు వినతిపత్రాలు వచ్చినట్టు శివకృష్ణ వెల్లడించారు. అవన్నీ భూ వివాదాలకు సంబంధించినవే.



పొదలకూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సూరాయపాళెం రైతులు

ఇళ్ల స్థలాల కోసం..

మనుబోలు: తహసీల్దార్ సుబ్బయ్య ఉదయం 10.15 గంటలకు విచ్చేశారు. వివిధ సమస్యలపై 32 అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా ఇళ్ల స్థలాలు, భూముల సర్వే, రికార్డుల్లో పేర్ల నమోదుపై వినతులు అందినట్లు ఆయన తెలిపారు.

రెగ్యులర్ తహసీల్దార్ లేరు

తోటపల్లిగూడూరు: మండలానికి రెగ్యులర్ తహసీల్దార్ లేరు. ఇందుకూరుపేట మండల తహసీల్దార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈయన సోమవారం మధ్యాహ్నం వరకు తోటపల్లిగూడూరు కార్యాలయానికి రాలేదు. ఇతర అధికారులు ఉదయం గంటల తర్వాత ఒక్కొక్కరిగా కార్యాలయానికి విచ్చేశారు. తహసీల్దార్ కోసం పలువురు అర్జీదారులు వచ్చి కొంత సమయం వేచి ఉండి వెనుదిరిగారు.



వేచి ఉన్న అర్జీదారులు

పింఛన్ కోసం..



పింఛన్ కోసం అర్జీ ఇస్తున్న మహిళ

కోవూరు: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ నిర్మలానంద బాబా, ఎంపీడీఓ శ్రీహరితో పాటు ఏపీఎం సుబ్బరాజు, హౌసింగ్ ఏఈ మాధవయ్య, ఎఫ్‌డీఓలు మాత్రమే హాజరయ్యారు. ఇంకా పలు శాఖల అధికారులు రాలేదు. కాగా వేగూరు వసంతపురానికి చెందిన గున్నం తిరుపతమ్మ పింఛన్ కోసం అర్జీ సమర్పించింది.

పొలం సమస్యలపై వినతుల స్వీకరణ

కొడవలూరు: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ స్ఫూర్తి ఉదయం 10:20 నిమిషాలకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన కార్యక్రమంలో నలుగురు అర్జీదారులు వచ్చి వినతులు అందజేశారు. వాటిలో పొరుగు రైతులు పులక నీరు పోనివ్వడం లేదని ఓ రైతు విన్నవించుకోగా, ఇద్దరు తమ పొలంలో వ్యత్యాసాలున్నాయని, పొలాన్ని సర్వే చేయించాలని వినతులిచ్చారు. మరో మహిళ 1–బీలో భర్త పేరు తప్పుగా వచ్చిందని, దీనిని సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరిస్తామని అర్జీదారులకు తహసీల్దార్ హామీ ఇచ్చారు.

- **విడవలూరు:** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తహసీల్దార్ చంద్రశేఖర్ ఉదయం 10 గంటలకు హాజరు కాగా ఇతర శాఖల అధికారులు చేరుకునేలోగా సమయం 10:30 గంటలైంది. కాగా పొలం సమస్యలపై మొత్తం మూడు అర్జీలను అధికారులు స్వీకరించారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ సర్వేయర్‌ను పంపించి పొలాలకు రీసర్వే చేయించి తప్పులను సరిచేస్తామని వివరించారు. మరికొందరు కులం సర్టిఫికెట్, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్‌ను కలిసి అర్జీలు ఇవ్వగా వాటిని ఆయన వెంటనే పరిష్కరించారు.
- **ఇందుకూరుపేట:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ నాగేంద్రబాబు, ఏపీఎం సరిత 10.25 గంటల్లోగా హాజరు కాగా మిగిలిన శాఖల అధికారులు ఆలస్యంగా వచ్చారు. కాగా ఇందుకూరుపేట పంచాయతీ పరిధిలో పొలం బాటకు సంబంధించి ఒక్క అర్జీ మాత్రమే వచ్చింది.



కొడవలూరు : పొలం సర్వేపై తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చి వివరిస్తున్న రైతు



విడవలూరు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

జిల్లా కార్యాలయానికి..

వెంకటాచలం: తహసీల్దార్ శ్రీనివాసులు కార్యాలయానికి 10.15 గంటలకు వచ్చారు. నలుగురితో మాట్లాడి వినతులు స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. గృహనిర్మాణ, విద్యా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఇక్కడ అర్జీలిస్తే పరిష్కారానికి నోచుకోవడం లేదని, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్నారు.



కార్యాలయంలో ఉన్న అధికారులు

కేవలం మూడు అర్జీలు

ముత్తుకూరు: గతేడాది డిసెంబర్ 3వ తేదీన మండల తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి లంచం పుచ్చుకొంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అప్పటి నుంచి రెగ్యులర్ అధికారి నియామకం జరగలేదు. డీటీ ప్రదీప్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరిస్తున్నారు. సోమవారం ఆయన మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కేవలం మూడు మాత్రమే వచ్చాయి. ఆర్‌ఐ, సర్వేయర్, వీఆర్వోలు పైనాపురం రెవెన్యూ గ్రామంలో జరిగే భూముల రీ సర్వేలో ఉండటంతో అన్నీ తానై వ్యవహరించాల్సి వచ్చింది.



సమస్యలు తెలుసుకుంటున్న డీటీ ప్రదీప్

రహదారి భద్రతా మాసోత్సవాల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీసులు

వెంకటాచలం: మండలంలోని కసుమూరు గ్రామంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రహదారి భద్రతా మాసోత్సవాల ర్యాలీని సోమవారం నిర్వహించారు. నెల్లూరు రూరల్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో కలిసి కసుమూరు ప్రధాన రోడ్డుపై ర్యాలీ చేశారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ప్రయాణికులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని తెలియజేశారు.

వచ్చే నెలలో సీపీఎం మహాసభలు

తోటపల్లిగూడూరు: ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరిగే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకుడు బండి శౌరి కోరారు. మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, రైతుల సంక్షేమం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. మహాసభలకు వివిధ రాష్ట్రాల నుంచి సీపీఎం ముఖ్య నేతలు తరలివస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, నాయకులు మారుబోయిన రాజా, మోచర్ల రాధయ్య, ఇనమాల కొండయ్య, నెల్లపూడి మణి, ఇంగిలాల రామయ్య, మస్తాన్, కొండయ్య, నాగరాజు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ప్రదర్శిస్తున్న సీపీఎం నాయకులు

గ్రామాల్లో పక్కాగా లెప్రసీ సర్వే

కొడవలూరు: కుష్ఠు సర్వే సమగ్రంగా నిర్వహించాలని లెప్రసీ డీపీఎంఓ నరసారెడ్డి సూచించారు. మండలంలోని రేగడిచెలికలో జరుగుతున్న లెప్రసీ (కుష్ఠు) సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. కుష్ఠు రహిత సమాజం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా లెప్రసీ సర్వేను ప్రత్యేకంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. కుష్ఠును ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చని చెప్పారు. సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, ఏఎన్ఎం టి.రాధమ్మ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

అడిషనల్ డీఎంహెచ్‌ఓ తనిఖీ

ఇందుకూరుపేట: జగదేవిపేటలో జరుగుతున్న కుష్ఠు సర్వేను అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కిశోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడుకు పలు సూచనలు చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు : రేగడిచెలికలో సూచనలిస్తున్న నరసారెడ్డి

సద్వినియోగం చేసుకోండి

కోవూరు: గ్రామాల్లో జరుగుతున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ కృష్ణమౌర్య కోరారు. కోవూరు, విడవలూరు మండలాల్లో సోమవారం జరిగిన పశువైద్య శిబిరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు మండలాల్లో నాలుగు వైద్య శిబిరాలు నిర్వహించగా, 432 పశువులకు వైద్య పరీక్షలు జరిగాయన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణమౌర్య

ఆర్‌ఐగా నారాయణ

పొదలకూరు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నారాయణ నియమితులయ్యారు. ఈయన మనుబోలు, వెంకటాచలం మండలాల్లో పనిచేశారు. చాలాకాలంగా ఇక్కడ ఆర్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. పనిచేసేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. తాజాగా నారాయణ బాధ్యతలు స్వీకరించారు.

గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

పొదలకూరు: గ్రామాల్లో ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తామని మండలంలోని తాటిపర్తి పశువైద్యాధికారి డాక్టర్ సి.మురళీకృష్ణారెడ్డి తెలిపారు. తొలి రోజున సోమవారం సూరాయపాళెం గ్రామంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. డాక్టర్ మాట్లాడుతూ 686 పశువులు, దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించామని, గొర్రెలకు బొబ్బర వ్యాధి టీకాలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విరువూరు లైవ్ స్టాక్ అసిస్టెంట్ శిఖామణి, గ్రామస్తులు రవి, రామానాయుడు పాల్గొన్నారు.

- **తోటపల్లిగూడూరు:** ఈనెల 31వ తేదీ వరకు జరిగే ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇందుకూరుపేట పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ మురళీకృష్ణ కోరారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో సోమవారం శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ 99 లేగదూడలకు, 163 పెద్ద పశువులకు డీ వార్మింగ్ మందులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే 32 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, మరో 32 పశువులకు సాధారణ వైద్య పరీక్షలను చేశామన్నారు. కార్యక్రమంలో తోటపల్లిగూడూరు పశువైద్యాధికారి శ్రీనివాసులు, ఏహెచ్ఏలు వెంకటరత్నం, విజయ్‌కుమార్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ..

మనుబోలు: ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ మండలంలోని అక్కంపేట గిరిజనులు తహసీల్దార్ సుబ్బయ్యను కోరారు. టీడీపీ నాయకుడు పూండ్ల రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

అదనపుకట్నం కోసం వేధింపులు

- పోలీస్ కేసు నమోదు

పొదలకూరు: అదనపుకట్నం కోసం భర్త, అతని కుటుంబసభ్యులు వేధిస్తున్నారంటూ మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు చేయడంతో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్‌కే అనీఫ్ కథనం మేరకు.. గోపిదేశి శ్రీహర్షకు పొదలకూరు గేట్ సెంటరులో నివాసం ఉన్న వినోద్‌కుమార్‌కు ఐదేళ్ల క్రితం వివాహమైంది. కట్నం కింద శ్రీహర్ష తల్లిదండ్రులు 23 సవర్ల బంగారం, రూ.3 లక్షల నగదు అందజేశారు. అదనపుకట్నం కోసం భర్త, అత్త లక్ష్మి, మామ దశరథరామయ్య, ఆడబిడ్డ వినీల వేధిస్తున్నారంటూ శ్రీహర్ష ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవదాయ భూములను కాపాడండి



మాట్లాడుతున్న చలపతిరావు, చిత్రంలో ప్రజాప్రతినిధులు, నాయకులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు

కొడవలూరు: దేవదాయ, ప్రభుత్వ భూములను కాపాడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు కోరారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథి గృహ ప్రాంగణంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నార్తురాజుపాళెంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి 1934లో 14.92 ఎకరాల మాగాణి భూమిని దానం చేసిన వారు ట్రస్టీ కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. 2016 నాటికి కొందరు ఆక్రమణదారులు ఐదున్నరేళ్ల మైనర్ బాలుడి పేరుతో కొంత భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. దీనిపై అదే సంవత్సరంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఆక్రమాన్ని గుర్తించి భూములు ఆలయం పేరుతోనే ఉండేలా సరి చేయాలని తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై ఆక్రమణదారులు కోర్టులో స్టే తేవడం జరిగిందన్నారు. 2020లో అదే సహాయ కమిషనర్ కొడవలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆక్రమణదారులపై క్రిమినల్ కేసు పెట్టారని, దీనిపైనా స్టే తేగా 2024లో స్టే వెకేట్ చేశారన్నారు. దేవదాయశాఖ మంత్రి జోక్యం చేసుకుని స్వామివారి ఆస్తులు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

కొట్టేసేందుకు యత్నం

టపాతోపులోని 63, 76, 77, 81, 83, 84 సర్వే నంబర్లలోని ఐదెకరాల ప్రభుత్వ భూమిని పచ్చనేతలు కారు చౌకగా కొట్టేసేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. ఇక్కడ ఎకరా రూ.96 లక్షలు పలుకుతుండగా రూ.9 లక్షలకే ఎకరాను కొట్టేసేందుకు పచ్చ నాయకులు యత్నిస్తున్నారని తెలిపారు. దీనిపై జిల్లా రిజిస్ట్రారుకు ఫిర్యాదు చేశామన్నారు. బుచ్చి రోడ్డులోని 349 సర్వే నంబర్‌లో 20 సెంట్ల రోడ్డు పోరంబోకు భూమిని ఆక్రమించి శాశ్వత నిర్మాణం చేస్తుంటే అడిగేవారు లేకుండాపోయారన్నారు. నార్తురాజుపాళెం హైస్కూల్ ముందున్న 72 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించారంటూ పచ్చనేతలు చేస్తున్న రాద్ధాంతంలో వాస్తవం లేదన్నారు. పక్కా ఆధారాలతో ఆక్రమణల పర్వం బహిర్గతం చేస్తున్నందున ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి, నాయకులు మోహనకృష్ణ, కె.శ్రీనివాసులురెడ్డి, మాణిక్యరావు, కె.మోహన్‌రావు, ఎండీ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

అకారణంగా ఎలా తొలగిస్తారు?

కొడవలూరు: ఎన్నో ఏళ్లుగా మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిగా పనిచేస్తున్న మహిళను అకారణంగా ఎలా తొలగిస్తారంటూ ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ నార్తురాజుపాళెం హైస్కూల్ హెచ్‌ఎం ఓబులేసు, ఎంఈఓ వసంతకుమారిలను ప్రశ్నించారు. ఈ మేరకు వారు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావుతో కలిసి సోమవారం మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేసేందుకు స్కూల్‌కు వచ్చిన నిర్వాహకురాలిని హఠాత్తుగా నిలిచిపోవాలని హెచ్‌ఎం ఓబులేసు చెప్పడం దారుణమన్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో నిలిపివేసి అడిగితే కుంటిసాకులు చెప్పడం ఎంతవరకు సమంజసమని అడిగారు. నిర్వాహకురాలికి ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఎలా తొలగించారో హెచ్‌ఎంను వివరణ కోరి డీఈఓకు తెలియజేస్తానని ఎంఈఓ వసంత కుమారి చెప్పారు.



చలపతిరావుతో కలిసి ఎంఈఓను ప్రశ్నిస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు

వేధిస్తున్నారని దళిత సర్పంచ్ ఫిర్యాదు

కొడవలూరు: దళిత సర్పంచ్‌నైన తనను అవమానకరంగా మాట్లాడుతూ వేధిస్తున్నారంటూ మండలంలోని కొత్తవంగల్లు సర్పంచ్ ఆమవరపు సింధు కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం నెల్లూరులో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేసిన పనులకు బిల్లులు పెట్టాలంటే ఈఓపీఆర్డీ కించపరిచి మాట్లాడుతున్నారని చెప్పారు. నీకు ఏ పనులు జరగాలన్నా టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న శ్రీహరిరెడ్డిని కలిసి మొర పెట్టుకోవాలని అధికారులే చెబుతున్నారని వాపోయారు. సర్పంచ్‌గా కనీస గౌరవం అధికారులు ఇవ్వడం లేదని, తనకు న్యాయం చేయాలని మొర పెట్టుకున్నారు. అనంతరం ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ సుప్రియలతో కలిసి ఎంపీడీఓ ఏవీ సుబ్బారావుకు వినతిపత్రం ఇచ్చారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్